వక్ఫ్ బిల్లు సవరణ రాజ్యాంగ విరుద్ధం

● నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపిన ముస్లింలు

మార్కాపురం: వక్ఫ్ బోర్డుపై కేంద్ర ప్రభుత్వం తెస్తున్న సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం పట్టణంలోని వివిధ మసీదుల వద్ద ముస్లింలు నమాజ్ అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు విషయంలో తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జామియా మసీదు ముతవల్లి మీర్జా సఫ్దర్ ఎమ్‌హెచ్‌పీఎస్ నాయకులు జాబీర్, న్యాయవాది సయ్యద్ జావీద్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



పొదిలిలో మౌన ప్రదర్శనలో ముస్లింలు

పొదిలిలో మౌన ప్రదర్శన

పొదిలి: వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు నిరసనగా పొదిలిలో ముస్లింలు శుక్రవారం మౌన ప్రదర్శన నిర్వహించారు. రంజాన్ పవిత్ర మాసంలో చివరి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం అధిక సంఖ్యలో ముస్లింలు మౌన ప్రదర్శనలో పాల్గొన్నారు. పెద్ద మసీదు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ భారత పౌరులుగా ఇస్లామిక్ చట్టంపై మత విశ్వాసాలను ఆచరించే హక్కు రాజ్యాంగం ముస్లింలకు కల్పించిందన్నారు. వక్ఫ్ ప్రతిపాదిత బిల్లును 2024 పార్లమెంటరీ చర్చలతో పాటు, ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో ఉన్న అధికారిక వెర్షన్‌లో కొత్త నిబంధనల గురించి తెలుసుకున్నట్లు చెప్పారు. సవరణలు వక్ఫ్ స్ఫూర్తికి, విలువలకు విరుద్ధమని గుర్తించామన్నారు. బిల్లులో సవరణలు చేపట్టవద్దని, వాటిని ఆమోదించవద్దని భారత ప్రభుత్వానికి విన్నవిస్తున్నట్లు చెప్పారు. ర్యాలీలో పెద్ద ఎత్తున ముస్లిం యువత పాల్గొన్నారు.


మార్కాపురంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు


గిద్దలూరు మసీదులో నిరసన తెలియజేస్తున్న ముస్లింలు

గిద్దలూరులో నిరసన

గిద్దలూరు రూరల్: వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకిస్తూ పట్టణంలోని రాచర్ల రోడ్డులో గల మక్కా మసీదులో శుక్రవారం ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్ద మౌలానా మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ముస్లింలకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ముస్లింలందరూ ఐకమత్యంలో బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మత పెద్దలు అక్బర్‌బాషా, సలీమ్, బాషా తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

బేస్తవారిపేట: స్థానిక ఇస్లాంపేటలోని మసీదులో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో శుక్రవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. 35 పేద కుటుంబాలకు నిత్యావసరం సరుకులు, దుస్తులు అందజేశారు. ఏటా ఇస్లాంపేటలోని మసీదులో పేద ముస్లింలు జమాతే ఇస్లామ్ హింద్ సహకారంతో రంజాన్ తోఫా అందిస్తున్నట్లు సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ మండల కమిటీ సభ్యులు, మత పెద్దలు పాల్గొన్నారు.


రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ముస్లిం సంఘ పెద్దలు

నేడు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడికి సన్మానం

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా నియమితులైన ఆవుల శ్రీధర్‌రెడ్డికి బేస్తవారిపేటలో శనివారం ఉదయం 10 గంటలకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు హాజరు కావాలని కోరారు.

బేస్తవారిపేటలో ఆధార్ సెంటర్ ఏర్పాటు

బేస్తవారిపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు తెలిపారు. ఆధార్ కార్డుకు సెల్ నంబర్ లింక్ చేయడం, సవరణలు, కొత్తగా నమోదు చేయడం, చిరునామా మార్పు, ఆధార్ అప్‌డేషన్ అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: స్థానిక తేరు బజార్‌లోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చన చేశారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణపై రాయితీ

పొదిలి రూరల్: గృహ వినియోగదారులు పెరిగిన విద్యుత్ వినియోగానికి అనుగుణంగా లోడ్ క్రమబద్ధీకరించుకుంటే రాయితీ వర్తిస్తుందని పొదిలి విద్యుత్ శాఖ ఏడీఈ హరిబాబు తెలిపారు. శుక్రవారం పొదిలి విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. విద్యుత్ వినియోగంపై అవగాహన లేక వినియోగదారులు జరిమానా చెల్లించాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 31వ తేదీలోగా 50 శాతం రాయితీపై స్వచ్ఛందంగా అదనపు లోడ్ క్రమబద్ధీకరించేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. రాయితీ వివరాల కోసం విద్యుత్ శాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

గిద్దలూరు ఏఎంసీ చైర్మన్‌గా బాలయ్యయాదవ్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా లింగాపురం గ్రామానికి చెందిన బైలడగు బాలయ్యయాదవ్ నియమితులయ్యారు. ఏఎంసీ చైర్మన్ పదవికి యాదవ సామాజిక వర్గానికి చెందిన బోనేని వెంకటేశ్వర్లుయాదవ్, బలిజ సామాజిక వర్గానికి చెందిన దుత్తా బాలఈశ్వరయ్య, ఎమ్మెల్యే అనుచరుల్లో ఒకరైన నంది శ్రీను పోటీపడగా వారిని కాదని బాలయ్యయాదవ్‌కు కేటాయించారు. ఈ సందర్భంగా బాలయ్యయాదవ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.


బాలయ్యయాదవ్

చెన్నకేశవుని ఆదాయం రూ.6.33 లక్షలు

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామివారి ఆలయానికి 2 నెలల 25 రోజుల హుండీ ఆదాయం 6,33,102 రూపాయలు వచ్చినట్లు ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం స్వామివారి ఆలయంలో హుండీ కానుకలు లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ బి.నాగమల్లేశ్వరరాజు, సిబ్బంది పాల్గొన్నారు.


కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకుందాం

● యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వీరాంజనేయులు

మార్కాపురం టౌన్: ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.వీరాంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం మార్కాపురం డివిజన్ యూటీఎఫ్ సమావేశం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా కార్యదర్శి బి.శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీకి ఒక ఆదర్శ ప్రాథమిక పాఠశాల పేరుతో పాఠశాలల్లోని 3,4, తరగతులను విలీనం చేయడం వల్ల ఏక ఉపాధ్యాయుడితో నడిచే పాఠశాలలు కనుమరుగవుతాయన్నారు. ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమీషన్ ఏర్పాటు చేయడంతోపాటు 30 శాతం మధ్యంతర భృతి విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె అబ్దుల్ హై, రాష్ట్ర నాయకులు ఓవీ వీరారెడ్డి, జిల్లా కార్యదర్శులు వెంకటేశ్వర్లు, బాబునాయక్, బాలవెంకటేశ్వర్లు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొనకనమిట్ల: మండలంలోని వివిధ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ బ్రహ్మం తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైను మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ట్రూఅప్ సర్ చార్జీలు తగ్గించాలి

● విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట సీపీఎం నేతల ధర్నా

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్ సర్‌చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా శుక్రవారం మార్కాపురం విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ట్రూఅప్ సర్‌చార్జి, సర్దుబాటు చార్జీ అంటూ ప్రజలపై భారాలు మోపడాన్ని ఖండించారు. వ్యవసాయ పంపుసెట్లకు, ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగించడాన్ని తప్పుబట్టారు. స్మార్ట్ మీటర్లను తక్షణమే తొలగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ, రూబెన్, కాశయ్య, నన్నేసా, జవ్వాజి రాజు తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు



వంటకాలు అమోఘం..
బస సౌకర్యవంతం


గిద్దలూరు పట్టణ వ్యూ

బేస్తవారిపేట: గిద్దలూరులోని లాడ్జీలు అన్ని వసతులతో సౌకర్యవంతంగా ఉన్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు బస చేసేందుకు, వేచి ఉండేందుకు చక్కటి సదుపాయాలు కల్పిస్తున్నాయి. వ్యాపార పనులపై వచ్చేవారికి, యాత్రికులకు మెరుగైన సేవలు అందిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు తక్కువ ధరలోనే లాడ్జిలు అందుబాటులో ఉన్నాయి. లాడ్జిల్లో ఏసీ, నాన్ ఏసీ, డబుల్ బెడ్‌రూమ్‌లు, సింగిల్ బెడ్ రూమ్‌లు, ప్రత్యేక సూట్ రూములు, టీవీ, వైఫై సేవలు అందుబాటులో ఉన్నాయి. లాడ్జిల్లో బసచేసే వారికి ఆర్డర్లపై భోజన సదుపాయం కల్పిస్తున్నారు.

రెస్టారెంట్లలో నోరూరించే వంటకాలు

గిద్దలూరు నగర పంచాయతీలో కొత్త, పాత రెస్టారెంట్లలో నోరూరించే వెజ్, నాన్‌వెజ్ వంటకాలు భోజన ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. మటన్ బిర్యానీ, చికెన్ దమ్ బిర్యానీ, ఎస్పీ బిర్యానీ, చికెన్ రోస్ట్ బిర్యానీ, మొఘలాయి బిర్యానీ ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. పార్టీలు, పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర వేడుకలకు ఆర్డర్లపై వంటలు తయారు చేస్తున్నారు. రాయలసీమ వంటకాలైన నాటుకోడి, తలకాయ కూర రుచికరంగా తయారు చేస్తున్నారు. కంజు బిర్యానీ, కంజు రోస్ట్, చిల్లి చికెన్, చికెన్ రోస్ట్, చికెన్-65 వంటి అనేక రకాలు వడ్డిస్తున్నారు. శిల్పా రెస్టారెంట్ తమ వినియోగదారులకు ఏడాదిపాటు బంపర్ ఆఫర్ ప్రకటించింది. రెండు బిర్యానీలు కొనుగోలు చేసిన వారికి ప్లేట్ స్టఫ్ ఉచితంగా అందిస్తోంది.